JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | శుక్రవారం 22-05-2026
Medchal - Malkajgiri | Friday 22-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 | సంచిక : 356
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 356 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com






జయభేరి, న్యూఢిల్లీ :

ఇజ్రాయెల్ రాజకీయాల్లో ముందస్తు ఎన్నికల సెగలు రేగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా హాట్ టాపిక్గా మారాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సారథ్యంలోని అధికార కూటమిలో తీవ్ర సంక్షోభం నెలకొనడం, ఆయన పదవికే ముప్పు వచ్చేలా ముందస్తు ఎన్నికల దిశగా అడుగులు పడుతుండటంతో ట్రంప్ మీడియా వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా తనదైన శైలిలో జోక్ చేస్తూ.. "ప్రస్తుతం ఇజ్రాయెల్ ప్రజల్లో నాకు 99 శాతం ప్రజాదరణ ఉంది. బహుశా అమెరికాలో నా పదవీకాలం ముగిసిన తర్వాత నేను ఇజ్రాయెల్ వెళ్లి అక్కడి ప్రధానమంత్రి పదవికి పోటీ చేస్తానేమో" అని వ్యాఖ్యానించారు. అలాగే, ఇరాన్ సంక్షోభంపై నెతన్యాహుకు ఏం చెప్పారని రిపోర్టర్లు ప్రశ్నించగా.. "ఆయన చాలా మంచి వ్యక్తి, నేను ఏం చెప్తే అదే వింటారు. ఆయన ఒక యుద్ధ కాలపు ప్రధాని, కానీ ఇజ్రాయెల్లో ఆయనకు దక్కాల్సిన సరైన గౌరవం దక్కడం లేదు" అని నెతన్యాహుకు ట్రంప్ మద్దతుగా నిలిచారు.



# భారీగా పెరిగిన కనీస వేతనాలు

- 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు శుభవార్త
- కార్మికుల కనీస వేతనాల పెంపు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి

*అన్‌స్కిల్డ్ కార్మికులకు ప్రస్తుత వేతనం రూ. 12,750 నుంచి రూ. 16 వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికులకు ప్రస్తుత వేతనం రూ. 13,592 నుంచి రూ. 17 వేలకు, స్కిల్డ్ కార్మికులకు రూ. 13,772 నుంచి రూ. 18,500 లకు, హైలీ స్కిల్డ్ కార్మికులకు రూ. 14,607 నుంచి రూ. 20 వేలకు పెంచినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పెంచిన వేతనాలు వచ్చే జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రంలో అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.*

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలోని 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు శుభవార్త. కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కార్మికుల కనీస వేతనాల పెంపు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. కనీస వేతనాలు పెంచిన శుభ సందర్భంగా ముఖ్యమంత్రి కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి కార్మిక ఉపాధి శిక్షణ శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కార్మికులకు ఈ శుభవార్తను చెప్పారు. రాష్ట్రంలో కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించి ఆ ప్రాతిపదికన వేతనాలను పెంచినట్టు తెలిపారు. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా 4 విభాగాలుగా విభజించినట్టు చెప్పారు. ఈ విభాగాల కార్మికులకు గతంలో అర్బన్, రూరల్‌గా 2 జోన్లు ఉండేవని, వాటిని ఇప్పుడు 3 జోన్లుగా విభజించామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలను పరిగణలోకి తీసుకుని కనీస వేతనాలను నిర్ణయించామని చెప్పారు.

...మిగతాది 2 లో

# రూ.5681 కోట్లకు గ్రీన్ సిగ్నల్

- తెలంగాణకు గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం
- కేంద్రం నుంచి 3 ప్రాజెక్టులు
- యూసీఎఫ్ కింద ఇచ్చినట్లు బండి సంజయ్ ట్వీట్

తెలంగాణకు కేంద్రం భారీ శుభవార్త అందించింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద.. ఏకంగా రూ.5681 కోట్ల నిధులకు ఆమోదం తెలిపింది. ఇందులో వరంగల్‌కు రూ.4674 కోట్లు.. కరీంనగర్‌కు రూ.840 కోట్లు, ఖమ్మం-వరంగల్-కరీంనగర్ కారిడార్‌కు రూ.166 కోట్లు విడుదల చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించి కేంద్రమంత్రి బండి సంజయ్ ట్వీట్ చేశారు.



జయభేరి, న్యూఢిల్లీ :

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. తాజాగా తెలంగాణ రాష్ట్రానికి వరాల జల్లు కురిపించింది. 3 ప్రధాన ప్రాజెక్టుల కోసం భారీగా నిధులను విడుదల చేసేందుకు ఆమోదం కల్పించింది. ఇందులో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ సహా పలు నగరాల అభివృద్ధికి నిధులను కేటాయించింది.

...మిగతాది 2 లో




# పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ఎలాంటి కొరత లేదు

- చమురు సంస్థలు

జయభేరి, న్యూ డిల్లి మే 21:

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు సరఫరాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ఎలాంటి కొరత లేదని చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. రష్యా నుంచి భారత్‌కు వస్తున్న ముడి చమురు సరఫరాలో ఎటువంటి తగ్గుదల లేదని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వర్గాలు గురువారం వెల్లడించాయి. ఇక దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపాయి. భారత్ ప్రస్తుతం పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో నికర ఎగుమతిదారుగా కొనసాగుతోందని పేర్కొన్నాయి.



# అంగన్వాడీలకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

- భారీగా నిధులు విడుదల.. ఉత్తర్వులు జారీ..

జయభేరి, విజయవాడ, మే21 :

అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. సుదీర్ఘ కాలంగా వారు ఎదురుచూస్తున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల కోసం ఏపీ సర్కార్ భారీగా నిధులను మంజూరు చేసింది. దీనికోసం దాదాపు రూ.19.70 కోట్ల అదనపు నిధులు కేటాయిస్తూ మహిళా, శిశు సంక్షేమ శాఖ కీలక జీవో జారీ చేసింది. ట్రెజరీ నిబంధనలను సడలించి మరీ ఈ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల కోసం ఏపీ సర్కార్ భారీగా అదనపు నిధులను మంజూరు చేసింది. అంగన్‌వాడీ మెయిన్, మినీ కార్యకర్తలతో పాటు సహాయకులకు ఈ బెనిఫిట్స్ అందించేందుకు గానూ ఏకంగా రూ.19,70,48,000 అదనపు నిధులను కేటాయిస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ నిధుల విడుదలకు సంబంధించి మహిళలు, బాలలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కీలక ఉత్తర్వుల ప్రకారం.. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిల చెల్లింపుల కోసమే ప్రత్యేకంగా ఈ నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

...మిగతాది 2 లో



# చీలక దిశగా తృణమూల్

జయభేరి, కోల్ కత్తా, మే 21 :

పశ్చిమ బెంగాల్‌ను దశాబ్ద కాలం పాలించిన మమతా బెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అధికారం కోల్పోయిన తర్వాత లీడర్, కేడర్ అంతా నిస్తేజంలోకి వెళ్లిపోయారు. అప్పటి వరకు ఓ వెలుగు వెలిగిన నాయకులంతా సైలెంట్ అయిపోయారు. మమతా బెనర్జీ పిలుస్తున్నా సమావేశాలకు రావడం లేదు. మరోవైపు పార్టీలో అనధికారిక చీఫ్‌గా ఉన్న అభిషేక్ విషయంలో మరికొందరు పార్టీ నాయకులు గుర్రుగా ఉన్నారు. పార్టీ ఈ స్థాయి ఓటమికి ఆయనే కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. అందుకే ఆయన నాయకత్వంలో పని చేయడానికి సిద్ధంగా లేమంటూ సంకేతాలు పంపిస్తున్నారు. దీంతో రెండు వర్గాలుగా చీలిపోయిన నాయకులతో టీఎంసీ తీవ్రమైన అంతర్గత సంక్షోభంలో కూరుకుపోతోంది. ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని మూటకట్టుకుంది. మమతను ఓడించిన బీజేపీ తొలిసారి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన ఒకప్పటి మమత అత్యంత సన్నిహితుడు సువేందు అధికారి ఇప్పుడు సంచలన నిర్ణయాలతో మమతకు ఎక్కడికక్కడ చెక్ పెడుతున్నారు. భవిష్యత్ లీడర్‌గా ప్రచారంలో ఉన్న అభిషేక్ బెనర్జీని టార్గెట్ చేస్తూ

...మిగతాది 2 లో




జయభేరి, న్యూ డిల్లి మే 21:

అమెరికాలో తాజాగా జరుగుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగ కోతలు అక్కడ పనిచేస్తున్న భారతీయ టెకీల జీవితాలను తీవ్ర అనిశ్చితిలోకి నెడుతున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా భారతీయ ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు అమెరికాలోని అగ్రశ్రేణి టెక్ సంస్థలను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. వారు కోడ్ రాశారు, టీమ్‌లను నడిపించారు, ఇళ్లు కొనుగోలు చేశారు, కుటుంబాలను ఏర్పాటు చేసుకున్నారు. చాలామంది అమెరికానే తమ శాశ్వత భవిష్యత్తు అని భావించారు. కానీ ఇప్పుడు, ఒక్క లేఆఫ్ ఇమెయిల్‌తో ఆ భవిష్యత్తు మొత్తం కదిలిపోతోంది.

**ఎఫెక్ట్ భారతీయులపైనే..**

మెటా, అమెజాన్, లింక్డ్‌ఇన్ వంటి టెక్ దిగ్గజాలు భారీ స్థాయిలో ఉద్యోగాలను తగ్గిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), ఆటోమేషన్‌పై దృష్టి పెడుతూ కంపెనీలు తమ బృందాలను పునర్వ్యవస్థీకరిస్తున్నాయి. ఈ మార్పుల ప్రభావం అత్యధికంగా పడుతోంది H1B వీసాలపై పనిచేస్తున్న భారతీయులపైనే. ఎందుకంటే H1B వీసా నేరుగా ఉద్యోగంతో ముడిపడి ఉంటుంది. ఉద్యోగం కోల్పోయిన తర్వాత, కొత్త స్పాన్సర్‌ను వెతుక్కోవడానికి సాధారణంగా కేవలం 60 రోజుల సమయం మాత్రమే ఉంటుంది. ఆ గడువులో

...మిగతాది 2 లో

# ఆర్థిక స్థిరత్వం లేకపోతే అభివృద్ధి నీటి మీద బుడగ

...మిగతాది 2 లో



# ధరణి తెచ్చిన తిప్పలను తొలగిస్తాం

- అర్హులందరికీ భూ పట్టాలు అందిస్తాం!
- మంత్రి పొంగులేటి

జయభేరి, ఖమ్మం :

గురువారం నాడు సత్తుపల్లి మండలం ఎంఆర్ గార్డెన్స్ లో ఎమ్మెల్యే మట్టా రాగమయి అధ్యక్షతన ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెరడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ధరణి పోర్టల్లోని లోపాల వల్ల పేదలు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రైతన్నలకు చుట్టం లాంటి భూ భారతి చట్టాని తీసుకురావడం జరిగిందని అన్నారు. నాడు గడీల పెత్తనంలో బందీ అయిన భూ రికార్డులను విడిపించి, భూములపై పేదలకే సర్వాధికారాలు కల్పించే దిశగా ప్రజాప్రభుత్వం కృషి చేస్తోంది.. అంతే కాదు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## భారీగా పెరిగిన కనీస వేతనాలు

అన్‌స్కిల్డ్ కార్మికులకు ప్రస్తుత వేతనం రూ. 12,750 నుంచి రూ. 16 వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికులకు ప్రస్తుత వేతనం రూ. 13,592 నుంచి రూ. 17 వేలకు, స్కిల్డ్ కార్మికులకు రూ. 13,772 నుంచి రూ. 18,500 లకు, హైలీ స్కిల్డ్ కార్మికులకు రూ. 14,607 నుంచి రూ. 20 వేలకు పెంచినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పెంచిన వేతనాలు వచ్చే జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రంలో అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. "కార్మికుల వేతనాల పెంపుపై తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో కార్మికుల వేతనాల పెంపు జరగలేదు. తద్వారా రాష్ట్రంలోని 1 కోటి 11 లక్షల మంది కార్మికులు నష్టపోయారు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతన సవరణపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి లతో మంత్రి వర్గ ఉపసంఘం నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్మిక సంఘాలు, నాయకులు, ఆయా సంస్థల యాజమాన్యాలు, ఇతర స్టేక్‌హోల్డర్స్ అందరితో సంప్రదింపులు జరిపి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత వేతన సవరణపై నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కార్మికుల సంక్షేమం కోసం మొట్టమొదటిసారి ఈ నిర్ణయం జరిగిందంటూ సంతోషం వ్యక్తం చేశారు. "ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల పెరుగుదల, ఇంటి అద్దె వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని కార్మికుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 1 కోటి 11 లక్షల కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇది కార్మికులకు శుభవార్త" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొంటూ ఈ సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనేక దేశాల్లో స్కిల్డ్ లేబర్ కొరత ఉందని, విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఏజెంట్ల చేతుల్లో కార్మికులెవరూ మోసపోవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా గల్ఫ్, పశ్చిమాసియా దేశాలకు వెళ్లే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి, అక్కడి కంపెనీలతో సంప్రదింపులు జరిపి వారికి ఏం కావాలో అందుకు అనుగుణంగా ఇక్కడి నుంచి కార్మికులను పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కార్మికులకు అన్ని రకాలుగా రక్షణగా ఉంటుందని, తొందర్లోనే మరిన్ని మంచి ప్రతిపాదనలతో ప్రభుత్వం ముందుకొస్తుందని చెప్పారు. గతంలో ప్రమాదవశాత్తు గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాలతో మరణిస్తే శవాన్ని కూడా తీసుకువచ్చే పరిస్థితి ఉండేది కాదని, తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వారి అంత్యక్రియలు నిర్వహించడమే కాకుండా ఆ కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నామని గుర్తుచేశారు.

## అంగన్వాడీలకు సర్కార్ గుడ్ న్యూస్

సాధారణంగా నిధుల విత్‌డ్రాపై ఉండే ఆర్థికపరమైన ఆంక్షలను ఈ విడతలో ప్రభుత్వం పక్కన పెట్టింది. అంగన్‌వాడీలకు త్వరితగతిన న్యాయం చేయాలనే ఉద్దేశంతో ట్రెజరీ నియంత్రణ, త్రైమాసిక నియమాలను సడలించి, ఈ నిధులను వెంటనే వినియోగించుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతానికి అడ్వాన్స్‌గా ఇస్తున్న ఈ మొత్తాన్ని రాబోయే 202627 ఆర్థిక సంవత్సరంలో సప్లిమెంటరీ గ్రాంట్స్ ద్వారా సర్దుబాటు చేయనున్నట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రకారం.. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కూడా గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం, 1972 కింద రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందేందుకు అర్హులని స్పష్టం చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం, రాష్ట్రవ్యాప్తంగా పదవీ విరమణ పొంది ఆర్థిక సాయం కోసం వేచి చూస్తున్న వేలాది మంది అంగన్‌వాడీలకు పెద్ద ఊరటనివ్వనుంది. ఈ నిధులను నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు చేరవేసే బాధ్యతను మహిళల అభివృద్ధి, బాల వికాస శాఖ డైరెక్టర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ మొత్తాన్ని సంబంధిత హెడ్ ఆఫ్ అకౌంట్‌లో డెబిట్ చేయాలని ఉత్తర్వుల్లో తెలిపారు. కాగా రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తూ రాత్రింబవళ్లు సేవలందిస్తున్న అంగన్‌వాడీల సంక్షేమానికి ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ తాజా జీవోతో వేలాది కుటుంబాల్లో రిటైర్మెంట్ భరోసా లభించినట్లయింది.

## ధరణి తెచ్చిన తిప్పలను తొలగిస్తాం

జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరును ఘనంగా ప్రారంభించబోతున్నాం. ముఖ్యంగా సత్తుపల్లి పట్టణ పరిధిలోని 399 సర్వే నంబర్ అంశంతో పాటు, చుట్టుపక్కల 9 గ్రామాల్లో ఉన్న దాదాపు 6,500 ఎకరాల భూ సమస్యల ను తప్పకుండా పరిష్కరిస్తానని భరోసా కల్పించడం జరిగింది. పేదపల్లి, నారాయణపురం పరిసరాల్లోని 5,500 ఎకరాల పైచిలుకు భూములను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో కొలతలు (సర్వే) చేపట్టి, స్వాధీనంలో ఉన్న అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, పహానీలలో వారి పేర్లు ఎక్కించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడం జరిగింది. రుద్రాక్షపల్లి, కొకపాడు, తాళపెంట, రామచంద్రాపురం, వెంకటగిరి సహా సరిహద్దుల్లోని 1012 గ్రామాల్లో నెలకొన్న అటవీరెవెన్యూ భూముల వివాదాలకు ఈ వర్షాకాలం ప్రారంభం అయ్యేలోపే సరిహద్దులను కొలిచి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అటవీ భూమి పోగా మిగిలిన రెవెన్యూ భూమిలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత నాదేనని భరోసా ఇచ్చాను. అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు పొందిన రైతులు సాగు కోసం బోర్లు వేసుకుంటుంటే అటవీ శాఖ అధికారులు ఎక్కడా అభ్యంతరాలు పెట్టవద్దని, జిల్లా అదనపు కలెక్టర్, ఉప కలెక్టర్లు ఈ వ్యవహారాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. తరువాత అనంతరం పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు సంబంధించిన ఆయా గ్రామాల ప్రజల నుంచి స్వయంగా అర్జీలు తీసుకుని, వారి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. రెవెన్యూ, గృహనిర్మాణం, అటవీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఏసీపీ, డీసీపీ, ఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ గారు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్స్, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ

● టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**జయభేరి, సంగారెడ్డి మే 21 :**

భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్కులో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని, యువతకు అవకాశాలు కల్పించడంలో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ , సాంకేతిక రంగ అభివృద్ధికి పునాది వేయడంలో రాజీవ్ గాంధీ చేసిన. కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు. తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రి లో నిర్మలా జగ్గారెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, సి డి సి చైర్మన్ గడిలా రామ్ రెడ్డి,సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కూన సంతోష్, ప్రభు గౌడ్ , కౌన్సిలర్లు తోపాజి వీణ హరీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన విభాగ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక స్థిరత్వం లేకపోతే అభివృద్ధి నీటి మీద బుడగ



ఎంత అభివృద్ధి చెందిన దేశం అయిన 'వనరుల స్వావలంబన', 'ఆర్థిక స్థిరత్వం' లేకపోతే ఆ దేశం అభివృద్ధి కేవలం నీటి మీద బుడగలాంటిదే. ఇప్పుడు ఇదే సూత్రం మన దేశానికీ కూడా వరిస్తుంది. ఇటీవల మన దేశ ప్రధాని 9 రకాల అంశాల పొదుపుపై చేసిన ప్రసంగంతో దేశం యావత్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది. గత ఆదివారం సాయంత్రం ప్రధాని హైదరాబాద్‌లో ఈ ప్రకటన చేయగానే సోమవారం ఉదయం స్టాక్ మార్కెట్ సూచీలు బెంబేలెత్తాయి. ఇప్పటికీ స్టాక్ మార్కెట్‌ల ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. స్వయాన ప్రధానమంత్రి దేశ ప్రజలకు పొదుపు పాఠాలు చెప్పడం, దేశ ప్రజలను అప్రమత్తం చేయడం చూస్తే 'వనరుల స్వావలంబన' 'ఆర్థిక క్రమశిక్షణ' లేకపోతే మునుముందు ఆర్థిక సంక్షోభం తప్పదా? అనే అనుమానాలు కలుగక మానదు. అయితే, ప్రధాని ప్రకటనలను కొంతమంది వ్యతిరేక దృక్పథంతో చూస్తే, మరికొందరు సానుకూల దృక్పథంతో చూస్తున్నారు. వాస్తవానికి ప్రధాని చేసిన ప్రకటనలను పాజిటివ్ దృక్పథంతో చూడాలి. ఎందుకంటే, ప్రధాని పేర్కొన్న 9 అంశాలు మామూలు అంశాలు కాదు. దేశ గమనం వీటిమీదనే ఆధారపడి ఉన్నది. వాటిలో బంగారం కొనుగోలు, పెట్రోల్ వాడకం తగ్గించుకోవడం, సేంద్రియ ఎరువులు వాడడం, వంట నూనెల వాడకం తగ్గించుకోవడం చాలా కీలకమైనవి. దాదాపు ప్రతీ సగటు జీవిపై వీటి ప్రభావం ఉంటది. అసలు ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంలో పెట్రోల్, బంగారం, నూనెలు, ఇతర విదేశీ ఉత్పత్తుల వాడకం గురించి దేశ ప్రధాని పొదుపు ప్రకటనలు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఎక్కువ శాతం దిగుమతుల మీద ఆధారపడ్డ మనదేశంలో వనరుల స్వావలంబన, ఆర్థిక క్రమశిక్షణ అవసరమా? అనేవి ప్రస్తుత పరిస్థితులలో అందరూ ఆలోచించాల్సిన తరుణం. దేశ జనాభాకి తగినట్టుగా భారతదేశంలో వనరులు లేవు. అందుకే, కొన్ని కీలక వస్తువుల వినియోగంలో దేశం దిగుమతుల మీద ఆధారపడి ఉన్నది. వాటిలో ముఖ్యమైనది ముడిచమురు కాగా, రెండవది బంగారం. మొదటిగా ముడి చమురు పరిశీలిస్తే, 2025 26 వాణిజ్య డేటా ప్రకారం, మొత్తం దేశ దిగుమతుల విలువ సుమారు 775 బిలియన్ డాలర్లు కాగా, వాటిలో సుమారు 135 బిలియన్ డాలర్ల విలువ గలిగిన చమురు దిగుమతులు కూడా ఉన్నాయి. ముడిచమురు, ఖనిజ ఇంధనం కలుపుకొని భారతదేశం మొత్తం దిగుమతులలో దాదాపు 30% పైననే ఉంటాయి. మొత్తం ముడి చమురు అవసరాలలో సుమారు 87.8% మనం ఇతర దేశాల నుండి దిగుమతి చేశామంటున్నాం. దేశ చమురు అవసరాలలో కేవలం 15% కంటే తక్కువ మాత్రమే దేశీయ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నది. మరోవైపు, మొత్తం ముడి చమురు దిగుమతిలో సుమారు 4550 శాతం కేవలం పశ్చిమాసియా దేశాల నుండి దిగుమతి అవుతుంది. ఇటీవల అమెరికా, ఇజ్రాయల్ ఇరాన్ మధ్య తలెత్తిన యుద్ధం ప్రభావంతో ముడి చమురు దిగుమతి తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్ లో దాని ధరలు కూడా పెరిగాయి. యుద్ధానికి ముందు (జనవరి నెలలో) బ్యారెల్ ముడి చమురు విలువ సుమారు 61.41 డాలర్ కాగా, ప్రస్తుతం దాని విలువ సుమారు 100 డాలర్ పైనే ఉన్నది. యుద్ధం తరువాత, దాదాపు అన్ని దేశాలలో పెట్రోల్, డీజిల్ ధరలు సగటున 25 నుండి 50 శాతం వరకు పెరిగాయి. కానీ మన దేశంలో మాత్రం ధరలు పెరగలేదు. ఆయా ధరల భారం సామాన్య ప్రజలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్త పడుతున్నది. కానీ రానున్న రోజుల్లో ఆ భారం మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు.

ఇకపోతే, బంగారం కూడా సుమారు ఒక ఏడాదిపాటు కొనుగోలు చేయవద్దని ప్రధాని చేసిన సూచన కొన్నివర్గాలకు రుచించడం లేదు. బంగారం మన దేశంలో ఒక సెంటిమెంట్ సాధనం. ప్రొడక్టీవ్ పర్పస్ కోసం కాకుండా కేవలం సెంటిమెంట్, అలంకరణ కోసం మాత్రమే బంగారం కొనుగోలు చేస్తున్నాము. ప్రపంచంలో ఉన్న మొత్తం బంగారం నిల్వలో, సుమారు 35 శాతం బంగారం మన దేశంలోనే ఉన్నది. 2024 25లో 58 బిలియన్ డాలర్ విలువ గలిగిన 757.09 టన్నుల బంగారం దిగుమతి చేసుకోగా, 202526 లో 78.98 బిలియన్ డాలర్ల విలువ గలిగిన 721.03 టన్నుల బంగారం దిగుమతి చేసుకున్నాం. గత సంవత్సరంతో పోల్చితే, బంగారం దిగుమతి పరిమాణం తగ్గినప్పటికీ సుమారు 24% వరకు బంగారం ధర మాత్రం పెరిగింది. దిగుమతి టారిఫ్ పెంచడం, యుద్ధం చేయడం వంటి అనవసర నిర్ణయాలతో ట్రంప్ ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాడు. అందుకే పెట్టుబడి దారులు, స్టాక్ మార్కెట్ లలో సంపదను సురక్షితమైన బంగారం వైపు తరలిస్తున్నారు. ఫలితంగా బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశాన్ని అంటాయి. కానీ బంగారం కొనుగోలు మాత్రం భారత్‌లో తగ్గలేదు. వినియోగదారు కొనుగోలు చేసిన బంగారం తిరిగి వారి లాకర్‌లోకి చేరుకుంటుంది. కానీ దాని ద్వారా ఎటువంటి ఉత్పాదకత జరుగదు. బంగారం దిగుమతి రాను రాను దేశానికీ భారం అవుతుంది. భవిష్యత్‌లో బంగారం దిగుమతులు పెరిగితే, అది దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ఆటంకం చేస్తుంది. ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా బంగారం, ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. వాటిని దిగుమతి చేసుకోవడానికి అయ్యే ఖర్చును డాలర్ రూపంలో చెల్లించాలి. మన దేశానికి వచ్చే రేమిటన్స్ తగ్గిపోవడం, ట్రంప్ నిర్ణయాలతో మన ఎగుమతులు తగ్గి దేశానికి డాలరు రాక తగ్గిపోయింది. కానీ బంగారం, ముడి చమురు వంటి ఇతర వస్తువుల దిగుమతి ఖర్చును డాలర్ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. మన దగ్గర తగిన విదేశీ నిల్వలు (డాలర్) లేకపోవడం వలన అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌ను కొనుగోలు చేయవలసి రావడం వలన రూపాయి విలువ తగ్గి డాలర్ విలువ పెరుగుతుంది. ట్రంప్ అధికారంలోకి రాక ముందు అంటే 2024 డిసెంబర్‌లో 1 డాలర్ విలువ 83 రూపాయలు కాగా, ఇప్పుడు అది సుమారు 95 రూపాయలకు చేరుకుంది. ఏప్రిల్ 17, 2026 నాటికి భారతదేశ విదేశీ మారక ద్రవ్యనిల్వలు 703.308 బిలియన్ డాలర్లు. పరిస్థితి ఇలాగే కొనసాగితే డాలర్ 100 రూపాయలకు చేరుతుంది. అప్పుడు దిగుమతులు మరింత భారం అవుతాయి. ఆ భారం దేశ ప్రజలపై పడుతుంది. ముఖ్యంగా చమురు ధరలు పెరిగితే సరుకు రవాణా పెరిగి అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇప్పటికే టోకు ద్రవ్యోల్బణం 3.88% కి చేరింది. రిటైల్ ద్రవ్యోల్బణం 3.40% గా ఉంది. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే, మరి కొద్దీ రోజుల్లోనే ద్రవ్యోల్బణం 44.5%కి చేరే ప్రమాదం ఉంది. ఇది సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, పారిశ్రామిక రంగాలు భారీగా నష్టపోతాయి. అందుకే, దిగుమతులు తగ్గించుకోవాలి. అంటే, ప్రజలు బంగారు, పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, ఇతర దిగుమతుల పై ఆధారపడ్డ వస్తువుల వినియోగం తగ్గించుకుంటే, అంతమేర దిగుమతులు తగ్గి ఈ కష్టకాలం నుండి బయట పడవచ్చును.

## చీలక దిశగా తృణమూల్

కీలక చర్యలు తీసుకుంటున్నారు. అక్రమాలు వెలుగులోకి తీసుకొచ్చి పార్టీలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. అభిషేక్ అక్రమాలను టార్గెట్ చేసిన సువేందు ప్రభుత్వం గతంలో అధికార దుర్వినియోగానికి ఏ స్థాయిలో పాల్పడ్డారో ప్రజల ముందు ఉంచుతోంది. అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే సువేందు గత ప్రభుత్వం చేసిన అక్రమాలను తవ్వడం మొదలు పెట్టారు. అభిషేక్ బెనర్జీకి చెందిన కంపెనీలు, ఆయన కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న ఆస్తులు, కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. దాదాపు ఇప్పటికే 17 నోటీసుల ఇచ్చారు. అక్రమాస్తులు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలు, రూల్స్ పాటించకుండా పనులు చేశారనే ఆరోపణలతో నోటీసులు పంపించారు.

**అభిషేక్‌పై వస్తున్న ఆరోపణలపై టీఎంసీ సైలెంట్**

డైమండ్ హార్బర్ పేరుతో అభిషేక్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని బీజేపీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఆ దిశగానే చర్యలు తీసుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తోంది. పార్టీలో రెండో స్థానంలో ఉన్న ఆ వ్యక్తిని టార్గెట్ చేయడం వల్ల మిగతా కీలకమైన నేతలంతా సైలెంట్ అయిపోయారు. తమకు అలాంటి పరిస్థితి వస్తుందని వారంతా పార్టీ కార్యక్రమాలకి కూడా దూరంగా ఉంటున్నారు. ఇప్పటి వరకు జరుగుతున్న పరిణామాలు ఒక ఎత్తైతే, ప్రస్తుతం జరుగుతున్న ఫాల్టా ఎన్నికల బరి నుంచి అభిషేక్ బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా పేరున్న జహంగీర్ తప్పుకోవడం పార్టీలో పొలిటికల్ హీట్‌ను మరింత పెంచుతోంది. బెనర్జీకి వచ్చిన నోటీసులను ఖండించటానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు.అభిషేక్ బెనర్జీని వ్యతిరేకిస్తున్న నేతల సంఖ్య పెరుగుతోంది. అలాంటి నేతలు మమత మాట వినని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఉన్న పరిస్థితి టీఎంసీ ఒక విధమైన అంతర్గత యుద్ధాన్ని ఎదుర్కొంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీని ఒక తాటిపై నడిపించడానికి మమత బెనర్జీ ఎలాంటి చర్యలు తీసుకుంటారనే ఆసక్తి బెంగాల్ ప్రజల్లో కనిపిస్తోంది.

## 60 రోజుల్లో ఉద్యోగం లేకపోతే అమెరికా వీడాల్సిందే!

మరో ఉద్యోగం దొరకకపోతే, అమెరికాను విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే భారతీయ టెకీలకు ఉద్యోగ కోత అనేది కేవలం కెరీర్ సమస్య మాత్రమే కాదు. అది వారి జీవితం మొత్తం మీద ప్రభావం చూపే సంక్షోభంగా మారుతోంది. హౌస్ లోన్స్, పిల్లల చదువు, ఆరోగ్య బీమా, గ్రీన్ కార్డ్ ఆశలు.. అన్నీ ఒక్కసారిగా అనిశ్చితిలో పడిపోతున్నాయి. చాలామంది భారతీయులు ఇప్పటికే గ్రీన్ కార్డ్ కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తున్నారు. కొందరికి అమెరికాలో పుట్టిన పిల్లలు ఉన్నారు. మరికొందరు అక్కడే శాశ్వతంగా స్థిరపడతామనే నమ్మకంతో ఇళ్లు కొనుగోలు చేశారు. ఇప్పుడు ఒక్క ఉద్యోగ నష్టం ఆ కలలన్నింటినీ కుదిపేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు తాత్కాలికంగా B1 లేదా B2 విజిటర్ వీసాలకు మారే ప్రయత్నం చేస్తున్నారు. దీని ద్వారా కొంత అదనపు సమయం సంపాదించి కొత్త ఉద్యోగం కోసం ప్రయత్నించవచ్చు. అయితే ఇటీవల అమెరికా అధికారులు ఇటువంటి దరఖాస్తులను మరింత కఠినంగా పరిశీలిస్తున్నారని ఇమ్మిగ్రేషన్ న్యాయవాదులు చెబుతున్నారు.

**ఏఐ ఎఫెక్ట్.. టెక్ ఉద్యోగాల భవిష్యత్తుపై అనేక సందేహాలు**

ఇదే సమయంలో AI ప్రభావం టెక్ పరిశ్రమను వేగంగా మార్చేస్తోంది. కంపెనీలు సంప్రదాయ ఇంజనీరింగ్, సపోర్ట్ పాత్రలను తగ్గిస్తూ AI ఆధారిత ఉద్యోగాల వైపు మళ్లుతున్నాయి. మెటా వంటి సంస్థలు బిలియన్ల డాలర్లను AI అభివృద్ధిపై ఖర్చు చేస్తున్నాయి. దీనితో సాధారణ టెక్ ఉద్యోగాల భవిష్యత్తుపై కూడా అనేక సందేహాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులు అమెరికాలోని భారతీయ నిపుణుల ఆలోచనలను కూడా మార్చుతున్నాయి. ఒకప్పుడు "అమెరికన్ డ్రీమ్"గా కనిపించిన జీవితం ఇప్పుడు వీసా అనిశ్చితి, ఉద్యోగ భయం, AI మార్పుల మధ్య సవాళ్లతో నిండిపోయింది. కొందరు తిరిగి భారతదేశానికి రావాలని ఆలోచిస్తుండగా, మరికొందరు కెనడా, యూరప్ వంటి ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. మొత్తానికి, అమెరికాలో ఉద్యోగ కోతలు భారతీయ టెకీలకు కేవలం ఉపాధి నష్టం మాత్రమే కాదు.. అది వారి భవిష్యత్తు, కుటుంబ భద్రత, స్థిర జీవితం అన్నింటినీ ప్రశ్నార్థకంగా మార్చుతున్న సంక్షోభంగా మారింది.

## రూ.5681 కోట్లకు గ్రీన్ సిగ్నల్

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద.. రూ.5681 కోట్లను విడుదల చేసేందుకు పచ్చ జెండా ఊపింది. దీనికి సంబంధించి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తాజాగా ట్వీట్ చేశారు. కరీంనగర్ కోసం భారీ రూ.840 కోట్ల ప్యాకేజీతో సహా 3 ప్రధాన ప్రాజెక్టుల కోసం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.5,681 కోట్లకు అధికారికంగా తుది ఆమోదం తెలిపిందని తెలియజేయడానికి చాలా సంతోషిస్తున్నానని.. బండి సంజయ్ తన ట్వీట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ 3 మెగా ప్రాజెక్టుల్లో భాగంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు భారీ స్థాయిలో మౌలిక వసతులు, అభివృద్ధి జరుగుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. వరంగల్ మురుగునీటి పారుదల ఆధునీకరణ కోసం.. రూ. 4,674 కోట్లు.. కరీంనగర్ మోడల్ రోడ్లు, మౌలిక సదుపాయాల కోసం రూ.840 కోట్లు.. ఖమ్మంవరంగల్‌కరీంనగర్ కారిడార్ కోసం.. రూ.166 కోట్లకు ఆమోదం తెలిపినట్లు బండి సంజయ్ వెల్లడించారు. ఇక ఇందులో కరీంనగర్ జిల్లా అభివృద్ధికి సంబంధించిన పూర్తి వివరాలని వివరించారు. ఈ రూ.840 కోట్లలో మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు, జంక్షన్ అభివృద్ధి కోసం రూ.630 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక మరో రూ.130 కోట్లను వర్షపునీటి కాలువల పునరుద్ధరణ, వరద నివారణ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. మిగిలిన రూ.80 కోట్లను.. సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ, డంప్ యార్డ్ పునరుద్ధరణ కోసం ఖర్చు పెట్టనున్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. పంపించిన ప్రతిపాదనల్లో కరీంనగర్ అభివృద్ధికి సంబంధించిన నిధులు లేవని.. కానీ కరీంనగర్‌ను చేర్చడానికి, డీపీఆర్‌ను వేగవంతం చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ వ్యక్తిగతంగా చొరవ తీసుకుని.. తాను ప్రత్యేకంగా వారికి విజ్ఞప్తి చేసినట్లు బండి సంజయ్ స్పష్టం చేశారు. అపెక్స్ కమిటీ సమావేశం, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించిన తర్వాత.. ఈ నిధులకు తుది ఆమోదం లభించిందని వెల్లడించారు. ఈ కొత్త ప్రాజెక్టులు తెలంగాణలోని పలు నగరాలను సంపూర్ణంగా ఆధునీకరిస్తాయని కేంద్రమంత్రి బండి సంజయ్ తేల్చి చెప్పారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తన తొలి విడతలో భాగంగా రూ.1,420.26 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లార్ ఖట్టర్‌కు ఈ సందర్భంగా బండి సంజయ్ కృతజ్ఞతలు చెప్పారు.




## న్యాయం జరుగుతుందని భరోసాని ప్రజల్లో కలిగించాలి

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపిఎస్.

**జయభేరి, వరంగల్ :**

పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. టాస్క్ ఫోర్స్ నూతన ఇన్స్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బండారి రాజుతో పాటు, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్ స్పెక్టర్ బాధ్యతలు చేపట్టిన కె. స్వామి గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఇరువురు అధికారులకు సీపీ తెలిపారు.

# పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

- పిఆర్ టియుటిఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్ర శేఖర్



**జయభేరి, దేవరకద్ర :**

బడి ఈడు కలిగిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వ బడి లో చేర్పించాలని పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మి పల్లిలో గురువారం జరిగిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ సుశిక్షతులైన, అపార అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ పరంగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులును పంపిణీ చేయడం తో పాటు ప్రతి రోజు మధ్యాహ్న భోజన పథకం కింద పౌష్టికాహారం అందించ డమే కాకుండా వారానికి మూడు సార్లు గుడ్లు, మరో మూడు రోజులు రాగి జావను విద్యార్థులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మురళీ ధర్, మదన్ మోహన్, అశ్విని చంద్ర శేఖర్ నాగేశ్వర్ రెడ్డి, కొండయ్య, అంగన్వాడీ కార్య కర్త లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## దేవరకద్రలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

- హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో గురువారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు మరియు ఆర్ జి పి ఆర్ ఎస్ నేషనల్ చైర్మన్ సునీల్ పన్వార్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్లు సిద్దేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి



**జయభేరి, తుర్కపల్లి, మే 21 :**

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు .గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం లో తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో కష్టాలు పడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తున్నప్పటికీ సకాలంలో కొనుగోలు జరగా రైతులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సిబ్బంది లేకపోవడం ,తూకం ప్రక్రియ ఆలస్యం కావడం హమాలీల కొరత, రవాణా సమస్యల కారణంగా రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మి నారాయణ గౌడ్, రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి భానోత్ నరేందర్ నాయక్, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లూ నర్సింహ యాదవ్, దానబోయిన సత్య నారాయణ, జిల్లా యువ మోర్చా కార్యదర్శి మేకల పాండు యాదవ్, మండల ప్రధాన కార్యదర్శులు భీనారం కనకయ్య, పాముల రామచంద్రం, చిలుకూరి రమేష్, జహంగీర్, కనుగంటి భాను పాల్గొన్నారు.

## సింహాచలం దేవస్థానం బోర్డు మెంబర్‌గా కరక దేముడు ప్రమాణ స్వీకారం

- ఘనంగా సత్కరించిన తెదేపా యువ నాయకులు



**జయభేరి, పరవాడ:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన బోర్డు మెంబర్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన కరక దేముడుకి పరవాడ మండల తెదేపా నాయకులు అభినందనలు తెలిపారు.తెదేపా యువ నాయకులు మేడిశెట్టి బాలాజీ నాయుడు,లోకిరెడ్డి సన్యాసినాయుడు (అభి) లు కరక దేముడుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవమైన సింహాద్రి అప్పన్న దేవస్థాన బోర్డు మెంబర్‌గా కరక దేముడు నియామకం కావడం పెందుర్తి నియోజకవర్గ ప్రాంతానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు.ఆయన నేతృత్వంలో ఆలయ ప్రాశస్త్యం మరింత పెంపొందాలని,భక్తుల సౌకర్యాల వృద్ధికి మరియు క్షేత్ర సమగ్ర అభివృద్ధికి ఆయన శక్తివంచన లేకుండా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా ముఖ్య నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొని నూతన బోర్డు సభ్యునికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంటల్లో చిక్కుకున్న కంటైనర్ లారీ..

- పది కొత్త కార్లు దగ్ధం

**జయభేరి, కామారెడ్డి :**

కంటైనర్ లారీ దగ్ధమయిన ఘటనలో పది కొత్త కార్లు మంటలకు ఆహుతాయ్యాయి. కామారెడ్డి నుండి హైదరాబాద్ వస్తుండగా మెదక్ జిల్లా తూప్రాన్ వద్ద ఒక్కసారిగా లారీ ఇంజన్ లో మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో పూర్తిగా 10 కొత్త మారుతి కార్లు దగ్ధమయ్యాయి. ఎండ తీవ్రతకు ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసుల అంచనా..



## దేవరకద్రలో కొనసాగుతున్న సంస్కార శాల ప్రత్యేక శిక్షణ

- దోకూర్ పవన్ కుమార్ రెడ్డి వినూత్న కార్యక్రమం
- చిన్నారుల్లో భారతీయ సంస్కృతి,నైతిక విలువల పెంపుకు ప్రత్యేక శిక్షణ

**జయభేరి, దేవరకద్ర :**

తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న "సంస్కార శాల" ప్రత్యేక శిక్షణ తరగతులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ శిక్షణ తరగతులు విశేష ప్రజా ఆదరణ పొందుతున్నాయి. చిన్నారుల్లో భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, ఆధ్యాత్మికత, క్రమశిక్షణ పెంపొందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. శ్రీవత్స వైదిక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి సహకారంతో దేవరకద్రలోని తపోవన్ పాఠశాలలో ఆరు రోజులపాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా ఈ తరహా కార్యక్రమాన్ని దేవరకద్రలో చేపట్టడంలో పవన్ కుమార్ రెడ్డి కీలక పాత్ర పోషించారని పలువురు అభినందిస్తున్నారు. 09నుండి 17 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు యోగా, ప్రాణాయామం, శారీరక వ్యాయామాలు, ధ్యానం, మనోవికాసం, భారతీయ సంస్కృతి మరియు నైతిక విలువలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటుండగా, తల్లిదండ్రుల నుంచి కూడా విశేష స్పందన లభిస్తోంది.ఈ సందర్భంగా కాశి, అయోధ్య వంటి ఆధ్యాత్మిక క్షేత్రాల నుంచి వచ్చిన విద్వాంసులు మాట్లాడుతూ..నేటి సమాజంలో పిల్లలకు కేవలం విద్య మాత్రమే కాకుండా సంస్కారం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. సంస్కార శాల ద్వారా చిన్నారుల్లో మంచి అలవాట్లు, క్రమశిక్షణ, దేశభక్తి, ఆధ్యాత్మిక భావనలు పెంపొందుతాయని తెలిపారు. భవిష్యత్ తరాలకు భారతీయ సంస్కృతి పరిరక్షణ ఎంతో అవసరమనే ఉద్దేశంతో డోకుర్ పవన్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా సహకరిస్తున్నారని, నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవరకద్రలో ప్రారంభమైన ఈ సంస్కార శాల రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ వసంతం వెంకటేష్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి, యజ్ఞ భూపాల్ రెడ్డి, కృష్ణంరాజు, దేవన్న సాగర్,నారాయణరెడ్డి, , అనిల్, శ్రీశైలం చారి, రాజు,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్రలో అనారోగ్యంతో యువకుడు మృతి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో గురువారం అనారోగ్యంతో ఓ యువకుడు మృతి చెందారు. స్థానిక నాయకుడు బైండ్ల రాములు కుమారుడు గౌరీ శంకర్(25) గత రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలించారు. దీంతో అక్కడ చికిత్స పొందుతూ గౌరీ శంకర్ మృతి చెందారు. మృతుడు గౌరీ శంకర్ కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అందరితో కలిసి మెలిసి ఉండే గౌరీ శంకర్ మృతి చెందడంతో దేవరకద్రలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- దేవరకద్రలో రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ



**జయభేరి, దేవరకద్ర :**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర రైతు వేదిక వద్ద గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీతో రైతులకు పచ్చి రొట్టె విత్తనాలు,జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగిస్తూ రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారిని అన్ని విధాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు.గత ప్రభుత్వం రైతుబంధు నేపథంతో రైతులకు ఇచ్చే అన్ని సబ్సిడీలను ఎగ్గొట్టిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక పక్క ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ, సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదిక చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగేంధర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, దేవరకద్ర, కౌకుంట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూనేటి అంజిల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డిలతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచులు పనిచేయాలి

- సర్పంచులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచన
- దేవరకద్రలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు ఒకరోజు శిక్షణ



**జయభేరి, దేవరకద్ర :**

సర్పంచులు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు.దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో గురువారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో,ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గస్థాయి ఈ సర్పంచుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. ప్రజా ప్రతినిధులు ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలన్నారు. అంతే కాకుండా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అప్పుడే ప్రజల మన్ననలు పొందుతారన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అందులో భాగంగానే పలు కార్యక్రమాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ జి పి ఆర్ ఎస్ నేషనల్ చైర్మన్ సునీల్ పన్వార్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్లు సిద్దేశ్వర్, డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్,టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్త అరవింద్ కుమార్ రెడ్డి లతోపాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల క్రొత్త హెల్త్ కార్డులపై అవగాహన

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు 80వ పుట్టినరోజు, 60వ పెళ్లిరోజు వేడుకలు దేవరకొండ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం సమావేశం జరిగినది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి మాట్లాడుతూ జూన్ 2వ తేదీన విడుదల చేయునట్టి ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల హెల్త్ కార్డు గురించి ఇంకా సరిఅయిన స్పష్టత రాలేదని ఇంకా కొద్దిరోజులలో వివరాలు తెలుస్తాయి అన్నారు.

అనంతరం అధ్యక్షులు తాడిశెట్టి నరసింహా 80వ పుట్టినరోజు వేడుక సందర్భంగా సంఘం తరపున కార్యదర్శి అంకం చంద్రమౌళి,కోశాధికారి పంగునూరు లింగయ్య, సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు పడమటి శాంతకుమారి జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, ప్రచార కార్యదర్శి పగిడిమర్రి సత్యమూర్తి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం అధ్యక్షులు నరసింహా దంపతులను సంఘం మహిళా సభ్యులు ఉపాధ్యక్షురాలు పడమటి శాంతకుమారి పూలమాలలతో అలంకరించి శాలువా కప్పి 60వ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసినారు. హాజరైన సభ్యులందరు దంపతులకు శుభాకాంక్షలు తెలిపి షాలువలు కప్పినారు. అనంతరం అధ్యక్షులువారు పసందైనా భోజనాలు ఏర్పాటు చేసినారు. స్వీట్స్ అందజేసినారు అందరికి కృతజ్ఞతలు తెలియజేసినారు.



## కోతులను పట్టే వాళ్ళని పిలిపించి కోతులను పట్టించడం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పురపాలక సంఘం నందు ప్రజలు కోతుల బెడద నుండి కాపాడుటకు నెల్లూరు నుండి కోతులను పట్టే వాళ్ళని పిలిపించి కోతులను పట్టించడం జరిగింది అని మునిసిపల్ చైర్మన్ శ్రీమతి పున్న శైలజ వెంకటేశ్వర్లు తెలియజేసినారు పట్టించిన కోతులను శ్రీశైలం ఫారెస్ట్ అడవులలో వదిలి పెట్టడం జరుగుతుందని తెలిపారు. వీరి వెంట మునిసిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్, జవాన్లు రాజేష్, శరత్ లు తదితరులు ఉన్నారు.

## మట్టి రోడ్డు పనులు ప్రారంభం



**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి నుండి నడింబాయిగూడెం రోడ్డు గుంతలమయం కావడంతో మట్టి పనులు ప్రారంభించిన గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఎం పీ ఓ ఒడిత్య నవీన్ గ్రామ ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ అర్వపల్లి సరిత నరసింహ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి మాజీ ఉపసర్పంచ్ బోడ లక్ష్మమ్మ వార్డు సభ్యులు బోడ నాగరాజు వడ్లపల్లి మల్లారెడ్డి వర్కాల జైపాల్ రెడ్డి సామ రాంరెడ్డి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన వడ్త్యా రమేష్ నాయక్



**జయభేరి, డిండి :**

డిండి మండలం దేవత్ పల్లి ప్రీమియం లీగ్ మండల స్థాయి (DPL) క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్. తండ BRS పార్టీ గ్రామ నాయకులు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతర DPL సభ్యులు BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ సరియ నాయక్ ,ప్రకాష్. నాయక్ ,శ్రీకాంత్, నాయక్ ,శోభన్ , లాచిరామ్, కిషన్ బోజి, బాధ్య నాయక్, దాస్రూ, మధు, నవీన్, వినోద్ ,చరణ్, హనుమంతు. నవీన్ నాయక్, గ్రామ పంచాయతీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి




**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్‌లోని స్వరూప్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పార్క్ డెంటల్ క్లినిక్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ పి. ప్రీతి, డాక్టర్ జె. సౌజన్య ఎమ్మెల్యేకి స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండడం ఎంతో ముఖ్యమని, ఉప్పల్ ప్రాంతంలో ఆధునిక సౌకర్యాలతో డెంటల్ క్లినిక్ ప్రారంభం కావడం ఆనందకరమని అన్నారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయిలో విజయం

**జయభేరి, ఉప్పల్ :**

తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 202627లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన ఉప్పల్ కి చెందిన తెలగవాపు హరిప్రియను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. రంగారెడ్డి జిల్లా కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మల్కాజిగిరి జిల్లాకు చెందిన హరిప్రియ 60 కేజీల విభాగంలో పాల్గొని మొదటి స్థానం సాధించడం గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

- భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు నడిపించిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ-తుంగతుర్తి రవి
- రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు




**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు నడిపించిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ.
నేడు మనం వాడుతున్న టెలికాం, సమాచార సాంకేతిక విప్లవానికి (IT Revolution) ఆయనే పునాది వేశారని. పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణ జరిపి, గ్రామాలకు నేరుగా నిధులు అందేలా చేసిన ఘనత రాజీవ్ గాంధీ దేనని కొనియాడారు.
రాజీవ్ గాంధీ ఆశయాలను, ఆయన దేశానికి చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని యువత, కాంగ్రెస్ కార్యకర్తలు దేశాభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చూపిన బాటలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ నడుస్తుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జంగచారి, భాస్కర్,రంజిత్ కుమార్ రెడ్డి, కవిడె కుమార్, మోహన్ కుమార్, అడ్వకేట్ నాగరాజు,మహ్మద్ మజర్,బర్రె నాగరాజు,సోమయ్య, శరత్ గౌడ్, కపిల్,మహిళా అధ్యక్షురాలు NNK దుర్గా, పరమేశ్వరి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## వార్డుల విభజనపై ఎమ్మెల్యేకు 79వ వార్డు జనసేన నాయకులు వినతి

**జయభేరి, పరవాడ :**



జీవీఎంసీ పరిధిలో చేపట్టిన వార్డుల పునర్విభజనపై దేశపాత్రునిపాలెం గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామ ప్రజలు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు కి వినతిపత్రం సమర్పించారు.ప్రస్తుతం దేశపాత్రునిపాలెం గ్రామం 79వ వార్డు పరిధిలో ఉంది. జీవీఎంసీ వార్డుల పునర్విభజనలో భాగంగా 79వ వార్డును లంకెలపాలెం, తాడి, సాలాపువనుపాలెం, మంత్రిపాలెం, ఈ మర్రిపాలెం గ్రామాలతో కలిపి 106వ వార్డుగా ప్రతిపాదించారు. అయితే దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న సాయి నగర్ కాలనీని ప్రస్తుత 77వ వార్డు నుండి వేరు చేసి 104వ వార్డులో కలపాలని అధికారులు నిర్ణయించారు.సాయి నగర్ కాలనీకి దేశపాత్రునిపాలెంతో విడదీయరాని సత్సంబంధాలు ఉన్నాయని, చారిత్రకంగా, సాంస్కృతికంగా ఒకే ప్రాంతమని గ్రామస్తులు వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం సాయి నగర్ కాలనీని దేశపాత్రునిపాలెంతోనే కలిపి ఉంచాలని ఎమ్మెల్యేను కోరారు ప్రస్తుతం 98 వార్డులుగా ఉన్న జీవీఎంసీని 120 వార్డులుగా పెంచాలని ప్రతిపాదించారు. అయితే పరిపాలన మరింత సులభతరం కావడానికి వార్డుల సంఖ్యను 150కి పెంచాలని ప్రతి వార్డులో ఉన్న ప్రజలు అభిప్రాయపడుతున్నట్టు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు ఈ కార్యక్రమంలో 79 వ వార్డు జనసేన అధ్యక్షులు పిల్లా శివకృష్ణ, ఉపాధ్యక్షుడు లక్కరాజు శ్రీనివాస్, టిడిపి నాయకులు జాజుల చిన్న, మరియు అమరపిన్ని గోపి, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండపం నిర్మాణానికి విరాళాలు సేకరణ

- తీదేడు గ్రామ శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలి
- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, తీదేడు గ్రామ సర్పంచ్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దక్షిణ మండపం నిర్మాణానికి గ్రామ ప్రజలు,యువత స్వచ్ఛందంగా విరాళాలు అందించడం అభినందనీయమని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా తీదేడు గ్రామానికి చెందిన అవిరినేని నరేందర్‌రావు,మర్రు రాఘవేందర్‌రావు,మర్రు చంద్రశేఖర్‌రావు,రూ.5,00,116/(ఐదు లక్షల నూట పదహారు రూపాయలు),మోర ధనమ్మ కృపాచారి 1,11,116 (ఒక లక్ష పదకొండు వేల నూట పదహారు రూపాయలు), బొంతల లలిత 1,00,116 (ఒక లక్ష నూట పదహారు రూపాయలు), మొరుపోజు లక్ష్మిపతి, మొరుపోజు శంకరాచారి లు 51,116 (యాభై ఒక్క వేల నూట పదహారు రూపాయలు), కండె పద్మ కుమారులు కండె సాయి, కండె నిలేష్ 30,116/(ముప్పై వేల నూట పదహారు రూపాయలు) విరాళాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దక్షిణ మండప నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఆలయ అభివృద్ధికి గ్రామ ప్రజలు ఐక్యంగా ముందుకు రావడం సంతోషకరమని అన్నారు.

## శాంతి వనం పార్క్ వద్ద చలివేంద్రం ఏర్పాటు

- తల్లిదండ్రులైన కీర్తిశేషులు సింగిరెడ్డి నరసింహారెడ్డి- లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు.. సింగిరెడ్డి పద్మారెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

ఈ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి తన తల్లిదండ్రులైన కీర్తిశేషులు సింగిరెడ్డి నరసింహారెడ్డి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం శాంతి వనం పార్క్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. శాంతివనం వాకర్స్ అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మా రెడ్డి మాట్లాడుతూ.. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరాలు అన్నదాన కార్యక్రమం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.








## మీ సురక్ష ప్రోగ్రాం

**జయభేరి, మల్కాజ్గిరి :**

మల్కాజ్గిరి సీపీ సుమతి IPS ప్రతిష్టాత్మకంగా మల్కాజ్గిరి కమిషనరేట్ లో MEESURAKSHA అనే ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే మన యొక్క కాలనిలో గాని, అపార్ట్మెంట్ లోగాని, మన పని ప్రదేశములో కానీ. పనిమనుషులు, సెక్యూరిటీ గార్డ్ ఇతర పనివారు ఉన్నట్లయితే వారియొక్క వివరాలను మాకు తెలియపరిచినట్లైతే మన కమిషనరేట్ లో మన పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి అన్ని కాలనిలు సురక్షముగా ఉంటాయి. అదేవిధంగా వారి యొక్క వివరాలు మన వద్ద ఉన్నట్లయితే ఒకవేళ నేరము జరిగిన త్వరగా వారిని పట్టుకొనుటకు ఉపయోగపడును. కావున హయత్నగర్ పట్టణ నివాసులు, కాలనీ అధ్యక్షులు పైన తెలిపిన స్కానర్ ద్వారా వారి వివరాలు తెలియచేయగలరు. మీకు ఎటువంటి ఇన్ఫర్మేషన్ కావాలన్న క్రింద నంబర్స్ కి సంప్రదించగలరు. పోలీస్ స్టేషన్ :8712662640, అడ్మిన్ SI నర్సింహా :8712662284, CI నాగరాజ్ గౌడ్ :8712662301, క్రైమ్ CI సంతోష్ :8712662282.


## డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం



**జయభేరి, జవహర్ నగర్ :**

గత పాలకుల వైఫల్యాక కారణంగా జవహర్ నగర్ ప్రాంత ప్రజల ప్రాణాలకు సంకటంగా మారీన డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. గురువారం జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి గాను ఏర్పాటు చేసిన అఖిల పక్ష పార్టీల నాయకలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 4 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని దానిక కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారని దానికి సాక్ష్యం ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి లేనని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ చెత్త పేరుకు పోవడానికి ప్రధాన కారణం గత పాలకుల వైఫల్యాలే అన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గాను ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నారని అన్నారు.

## కాలనీ రోడ్డు పొడవునా గుంతలు



**జయభేరి, మెహదీపట్నం :**

తల్లగడ్డలోని హెచ్.నెం 13-5-431/ఎ/51 మెహబూబ్ కాలనీ ముందు రోడ్డుపై అనేక గుంతలు ఉన్నాయి. ఈ ప్రాంతం మెహదీపట్నం, గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఈ రోడ్డు ఒక ఉన్నత పాఠశాలకు సమీపంలో కూడా ఉంది. రోడ్డు అధ్వాన్నంగా ఉండటం వల్ల వాహనదారులకు, పాదచారులకు, అలాగే పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. మా వాహనాలు గుంతలలోకి దూసుకెళ్లి దెబ్బతింటున్నాయి, దీనికి మరమ్మతులు అవసరం. అంతేకాకుండా, మ్యాన్‌హోల్ మూత కూడా దెబ్బతింది, దానిని వెంటనే మార్చాలి. తక్షణ చర్యలు తీసుకోవాలని నేను జిహెచ్ఎంసి విభాగాన్ని తల్లగడ్డలోని మెహబూబ్ కాలనీ ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

# చీరకట్టులో అదరగొట్టేసిన అదితి



ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్న ఈ ఫోటోలలో అదితీరావు హైదరీ 'జేడ్ బై మోనికా అండ్ కరిష్మా' కలెక్షన్ నుండి సేకరించిన అద్భుతమైన షీర్ ఆర్గాంజా చీరను ధరించారు. లేత షాంపేన్ రంగుతో మెరిసిపోతున్న ఈ చీరపై చేసిన సూక్ష్మమైన ఎంబ్రాయిడరీ వర్క్, గోల్డ్ సీక్విన్స్ మరియు అద్భుతమైన సితార అలంకరణలు రాజసం ఉట్టిపడేలా చేశాయి. ఈ మోనోక్రోమటిక్ శైలికి మ్యాచ్ అయ్యేలా ఆమె అదే రంగులో ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను జతచేశారు. ఈ బ్లౌజ్ యొక్క మోడ్రన్ కట్ అటు సాంప్రదాయ సౌందర్యాన్ని, ఇటు ఆధునిక ట్రెండ్‌ను ఎంతో సమతుల్యంగా ఆవిష్కరించింది. అంతర్జాతీయ ఫ్యాషన్ ప్రపంచం అంతా సరికొత్త సరిహద్దులను దాటుతూ వింత వింత దుస్తులు, భారీ శైలి గౌన్ల వైపు పరుగెడుతోంది. కేన్స్ చలనచిత్ర వేడుకల రెడ్ కార్పెట్ మీద తారలు ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా అత్యంత ఆడంబరమైన, మెరిసిపోయే వెస్ట్రన్ అవుట్‌ఫిట్స్‌తో సందడి చేస్తున్నారు. అయితే, ఈ హడావుడి మధ్య ఆ స్టార్ బ్యూటీ ఎంతో నిశ్శబ్దంగా, అత్యంత అందమైన ఒక భారతీయ సాంప్రదాయ చీరకట్టులో అడుగుపెట్టారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా కేవలం తన లుక్‌తోనే అంతర్జాతీయ ఫ్యాషన్ విశ్లేషకుల నోళ్లు మూయించారు. ప్రముఖ డిజైనర్ బ్రాండ్ 'జేడ్' (JADE) రూపొందించిన వస్త్రంలో ఆమె కేన్స్ వేదికపై ఒక పర్ఫెక్ట్ రెడ్ కార్పెట్ మూమెంట్‌ను సృష్టించారు. ప్రస్తుత జనరేషన్ ఫ్యాషన్ పిచ్చికి ఒక సున్నితమైన చురకలా అనిపించిన ఆమె లుక్, ఈ సీజన్ లోనే అత్యంత ఐకానిక్ లుక్స్‌లో ఒకటిగా నిలిచింది.



## 'పెద్ది' కోసం ప్రాణం పెట్టిన రామ్ చరణ్..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రామ్ చరణ్, బుచ్చిబాబు కలిసి పాల్గొన్న ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా రామ్ చరణ్ డెడికేషన్ గురించి బుచ్చిబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. సినిమా కోసం చరణ్ మూడు వేర్వేరు బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్స్ చేశారని తెలిపారు. క్రికెటర్ లుక్, ట్రైబల్ లుక్, రెజ్లర్ లుక్ కోసం ఆయన తీవ్రంగా శ్రమించారని చెప్పారు. దీనిపై స్పందించిన చరణ్.. "నువ్వు రాసిన కథతో నేను ప్రేమలో పడ్డాను. అంత మంచి కథ కోసం ఎంత కష్టపడినా తక్కువే. ఎండల్లో, ఇసుకలో షూటింగ్ చేయడం చాలా కష్టం అయినా, ప్రాసెస్‌ను ఆస్వాదించడంతో ఆ శ్రమ పెద్దగా అనిపించలేదు" అని తెలిపారు. అయితే రెజ్లింగ్ సన్నివేశాల చిత్రీకరణ మాత్రం తనకు చాలా కఠినంగా మారిందని చరణ్ వెల్లడించారు. "నన్ను అన్ని రకాల బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్స్ చేయించడానికి బుచ్చిబాబు చాలా కష్టపెట్టాడు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఇంటర్వ్యూలో మరో ఆసక్తికర విషయాన్ని కూడా రామ్ చరణ్ గుర్తుచేసుకున్నారు. కరోనా సమయంలో తాను కొంత మానసికంగా డౌన్ ఫీల్ అయ్యానని, ఆర్ఆర్ఆర్ షూటింగ్ తిరిగి మొదలయ్యే సమయంలో కూడా మునుపటి ఉత్సాహం లేదని చెప్పారు. ఆ సమయంలో దర్శకుడు రాజమౌళి ఇచ్చిన సలహా తనలో మళ్లీ ఉత్సాహాన్ని నింపిందని వెల్లడించారు. "పెద్ద లక్ష్యాల కంటే చిన్న పనులతో మొదలుపెట్టు. చిన్న విజయాలే పెద్ద మోటివేషన్ ఇస్తాయి" అని రాజమౌళి చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయని తెలిపారు. సినిమాలోని కుస్తీ ఎపిసోడ్స్ గురించి మాట్లాడుతూ, బుచ్చిబాబు యాక్టింగ్ తెలిసిన జూనియర్ ఆర్టిస్టుల కంటే నిజమైన రెజ్లర్లనే తీసుకొచ్చారని చరణ్ చెప్పారు. "వాళ్లు కెమెరా కోసం నటించలేదు. నిజంగానే మ్యాచ్ ఆడినట్టుగా నాపై దాడి చేసేవారు. సీన్ సహజంగా రావడం కోసం నేను కూడా వాళ్లతో అంతే తీవ్రంగా పోరాడాల్సి వచ్చేది" అని తెలిపారు.ఈ రియల్ ఫైట్స్ వల్ల తాను తీవ్ర గాయాలు కూడా ఎదుర్కొన్నట్లు చరణ్ వెల్లడించారు. "చివరి 25 30 రోజుల కుస్తీ షెడ్యూల్ చాలా కఠినంగా సాగింది. షూటింగ్ సమయంలో కంటికి బలమైన దెబ్బ తగిలి దాదాపు నాలుగు కుట్లు పడ్డాయి. అలాగే చేతికి కార్టిలేజ్ టియర్ కూడా అయ్యింది. చేతులకు వచ్చిన నొప్పి ఎంత తీవ్రంగా ఉందంటే షూటింగ్ పూర్తయిన తర్వాత నా కూతురిని కూడా ఎత్తుకోలేకపోయాను. ఇప్పటికీ ఆ నొప్పి పూర్తిగా తగ్గలేదు. ఎక్స్‌రే కూడా చేయించుకోవాలి" అని భావోద్వేగంగా చెప్పారు.

## లింగుస్వామి దర్శకత్వంలో?



గత ఏడాది 'తండేల్'తో కెరీర్‌లోనే భారీ హిట్‌ను అందుకున్నారు హీరో నాగచైతన్య. ప్రస్తుతం ఆయన మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ'లో నటిస్తున్నారు. షూటింగ్ చివరి దశకు చేరుకుంది. తాజా సమాచారం ప్రకారం తమిళ దర్శకుడు లింగుస్వామి డైరెక్షన్‌లో నాగచైతన్య ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. తమిళంలో సండైకోళి (పందెం కోడి), పయ్యా (ఆవారా) వంటి చిత్రాలతో పేరు పొందిన లింగుస్వామి గత కొంతకాలంగా సరైన సక్సెస్‌లేక సతమతమవుతున్నారు. రామ్ పోతినేనితో తెలుగులో ఆయన తీసిన 'ది వారియర్' కూడా ఆశించిన విజయాన్ని సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆయన తెలుగులో నాగచైతన్యతో సినిమాకు సిద్ధమవుతున్నారని తెలిసింది. యాక్షన్, ఫ్యామిలీ అంశాలు కలబోసినన కథ ఇదని, నాగచైతన్యను సరికొత్త పంథాలో ఆవిష్కరిస్తుందని చెబుతున్నారు. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

# 'ది ఇండియా స్టోరి' మూవీ టీజర్ త్వరలో విడుదల





ఆకట్టుకునే పోస్టర్‌తో ఆసక్తిని రేకెత్తించిన 'ది ఇండియా స్టోరి' మేకర్స్ తాజాగా మరో కీలక అప్డేట్ ఇచ్చారు. కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సోషియోనేషనల్ డ్రామా టీజర్ త్వరలో విడుదల కానుందని ప్రకటించారు. జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంబిజీ ప్రొడక్షన్ & స్టూడియోస్‌తో కలిసి రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. చెట్టన్ డీకే దర్శకత్వంలో, సాగర్ బి షిండే రచించి నిర్మిస్తున్న 'ది ఇండియా స్టోరీ: స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' రసాయనాల దుర్వినియోగం, ముఖ్యంగా పురుగుమందుల వ్యవసాయం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాలను ప్రధానాంశంగా తీసుకుని తెరకెక్కుతోంది. ఇటీవల విడుదలైన పోస్టర్ ఈ చిత్రంలోని తీవ్రమైన, ఆలోచింపజేసే అంశంపై ఒక బలమైన సంకేతాన్ని ఇచ్చింది. ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబ కథను దాటి, దేశవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్న సామాజిక సంక్షోభాన్ని ఈ చిత్రం ప్రతిబింబించనుంది. పరిశ్రమల నిర్లక్ష్యం, దాని వల్ల దాగి ఉన్న ప్రమాదాలు, సమాజంలో అవగాహన, బాధ్యత ఎంత అవసరమో ఈ కథ ద్వారా చూపించబోతున్నారు. త్వరలో రానున్న టీజర్ ప్రేక్షకులను 'ది ఇండియా స్టోరీ' ప్రపంచంలోకి మరింతగా తీసుకెళ్తుందని మేకర్స్ తెలిపారు. తొలిసారి కలిసి నటిస్తున్న కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే తమ ఎమోషనల్, ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో కథకు మరింత బలం తీసుకురానున్నారు. సుమిత్ బగాడే, అనితా జాధవ్, వినాయక్ సైదాని, కల్పేష్ షా, దేవ్యాని ఖోరాటే, ప్రేమ్ జోషి సహనిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ నిశాంత్ భగవత్, సంగీత దర్శకుడు మంగేష్ ధక్డే, ఎడిటర్ ఆశిష్ మాత్రే, లిరిసిస్ట్ షకీల్ అజ్మీ, సౌండ్ డిజైనర్ అన్మోల్ భావే పని చేస్తున్నారు. హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో కూడా ఈ చిత్రం విడుదల కానుంది. జీ స్టూడియోస్ వరల్డ్‌వైడ్ రిలీజ్‌గా 'ది ఇండియా స్టోరీ' ప్రేక్షకుల ముందుకు రానుంది.



## ప్యాట్ కమిన్స్ బౌలింగ్‌లో జాన్వీ బ్యాటింగ్..

ఐపీఎల్ 2026 క్రేజ్ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న వేళ సోషల్ మీడియాలో ఒక సరదా వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కలిసి ఆడిన గల్లీ క్రికెట్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. క్రికెట్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులను కూడా ఈ వీడియో బాగా ఆకర్షిస్తోంది. నోయిడాలోని ప్రముఖ DLF మాల్ ఆఫ్ ఇండియాలో ఇటీవల జరిగిన ఓ ప్రమోషనల్ ఈవెంట్‌కు ప్యాట్ కమిన్స్, జాన్వీ కపూర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరూ సరదాగా క్రికెట్ ఆడి అక్కడి ప్రేక్షకులను అలరించారు. జాన్వీ టీ షర్ట్‌లో క్యాజువల్ లుక్‌లో బ్యాట్ పట్టుకుని క్రీజులోకి రాగా, కమిన్స్ బౌలింగ్ చేయడం ఆసక్తికరంగా మారింది. ప్రపంచ స్థాయి పేసర్ అయిన కమిన్స్ వేసిన తొలి మూడు బంతులను జాన్వీ కపూర్ జాగ్రత్తగా ఆడింది. అయితే నాలుగో బంతిని బలంగా కొట్టే ప్రయత్నంలో ఆమె షాట్ అక్కడున్న ఒకరి కంటికి తగిలినట్లు సమాచారం. దీంతో అక్కడ ఒక్కసారిగా నవ్వులు వెల్లువెత్తాయి. ఈ సరదా సంఘటనకు సంబంధించిన వీడియోలు, ఫోటోలను జాన్వీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ, "నా బ్యాటింగ్ వల్ల బంతి ఎవరికైతే తగిలిందో వారికి క్షమాపణలు. ఇంకా నా బ్యాలెన్స్ కోసం వెతుకుతున్నాను" అంటూ ఫన్నీ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**